# దళిత కవిత్వంలో పురాణ ప్రతీకలు



పొనుగోటి రవికుమార్



# 1. దళిత కవితోద్యమ నేపథ్యం

ఆధునిక కవిత్వంలో భావకవిత్వం, అభ్యుదయం, విప్లవకవిత్వం మొదలైన ఉద్యమాలు వచ్చాయి. అమలిన శృంగారం, ప్రకృతి చిత్రణ, దేశభక్తి, స్మృతిలక్షణాలతో భావకవిత్వం కొనసాగింది. ఆ తరువాత మార్క్సిజం ప్రభావంతో అభ్యుదయ కవిత్వం సామాన్య మానవునికి సాహిత్యంలో స్థానం కల్పించింది. శ్రమ శక్తిని గుర్తించి శ్రమైక జీవన సౌందర్యాన్ని అభిలషించింది. తాడితులు, పీడితులు, కార్మికులు, కర్షకులు, పతితులు, భ్రష్టులు, బాటసారులు, భిక్షువర్షీయులు, ఉన్మాదులు ఇలా ఎందరెందరికో సాహిత్యంలో స్థానం కల్పించింది. సమాజంలోని సమస్యలు మధ్యతరగతి మానవుల అవస్థలు, సమసమాజ స్థాపన అనే లక్ష్యాలతో అభ్యుదయ కవిత్వం వచ్చింది. అక్కడ నుండి మార్క్సిజం, లెనినిజం మావో ఆలోచనా విధానాలతో దోపిడీదారులపై, భూస్వాములపై ధ్వజమెత్తుతూ సమసమాజ స్థాపన కొరకు పరిస్థితినిబట్టి హింసైనా అవసరమేనని నమ్మి వచ్చిన ఉద్యమం విప్లవకవిత్వం. దీని తరువాత రకరకాల ఉద్యమ ధోరణులు వచ్చాయి. విప్లవకవిత్వం తరువాత వచ్చిన ఉద్యమాలలో దళిత కవితోద్యమం బలమైన చారిత్రక ప్రాధాన్యం కలిగింది.